# కాంగ్రెస్‌ను నమ్మితే అరిగోసే..

- ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి
- తెలంగాణ దేశానికే ఆదర్శం

:స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మక్తల్‌టౌన్ , అక్టోబర్ 30: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని నమ్మి ఓటేస్తే అరిగోస తప్పదని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన సోమవారం పట్టణంలో వెంకటేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన మండల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే చిట్టెం, ఎన్నికల ఇన్‌చార్జి, తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్లాడుతూ తెలంగాణలో వారెంటీ లేని పార్టీ కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీలను ప్రకటిస్తూ తెలంగాణ ప్రజలను మభ్యపెట్టెందుకు ప్రయత్నిస్తుదన్నారు. 70 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ దేశాన్ని మొత్తం సర్వ నాశనం చేసి, మరోసారి తెలంగాణ ప్రజలను మోసం చేసి తెలంగాణ సంపాదనంతా ఢిల్లీకి పంపించాలనే ప్రయత్నం చేస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. మరో సారి సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదిస్తే తెలంగాణ రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మరోసారి తనకు అవకాశం కల్పించి తనను ఆశీర్వదించడానికి వచ్చే నెల 6వ తేదీన మక్తల్‌కు వస్తున్నారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలకు సూచించారు. నవంబర్ 30న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మక్తల్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు.

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఆంజనేయగౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. బీఆరెస్ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకరూ రాత్రింబవళ్లు కష్టపడాలని పిలుపునిచ్చారు. కులపోడో, చెడ్డి దోస్తో అని ఏమరపాటున ఇతర పార్టీ అభ్యర్థులకు కాకుడా నిక్కార్సైన బీఆర్ఎస్ కార్యకర్తగా రామన్నను భారీ మెజార్టీతో గెలిపించాల్సిన భాధ్యత మీపై ఉందన్నారు. కా ర్యక్రమంలో రైతు బంధు సమితి సభ్యురాలు చిట్టెం సుచరితా రెడ్డి, ఎంపీపీ వనజమ్మ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుపా, లలిత ముదిరాజ్, కౌన్సిలర్లు రాములు, మోగులప్ప, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్ గౌడ్, నాయకులు. అమరేందర్‌రెడ్డి, కావలి శ్రీహరి, ఆశిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, కావలి తాయప్ప, హన్మంతు, రాజు, రవీందర్ రెడ్డి, రామలింగం, చిన్న హన్మంతు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలను వివరించాలి

- చిట్టెం చాణిక్యారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చిట్టెం చాణిక్యారెడ్డి

మాగనూర్, అక్టోబర్ 30: ప్రతి ఒక్కరికీ సీఎం కేసీఆర్ అందిస్తున్న, అందించబోయే సంక్షేమ పథకాలు వివరించాలని ఎమ్మెల్యే తనయుడు చాణి క్యారెడ్డి పార్టీ కార్యకర్తలకు సూచించారు. సోమవారం మండలంలోని గజు రందొడ్డి, మందిపల్లి, కోల్పూర్, పుంజనూర్, అడవిసత్యారం గ్రామాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి అధ్వర్యంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఓట్ల కోసం మాయ మాటలు చెప్పే మోసగాళ్ల బారిన పడకుండా కారు గుర్తు కు ఓటు వేయించి చిట్టెం రామ్మన్న గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకటయ్య, సింగిల్ విండో చైర్మన్ వెంకట్ రెడ్డి , సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అశోక్ గౌడ్, మాగనూర్ ఉమ్మడి మండల ఎలక్షన్ ఇన్‌చార్జి లక్ష్మీకాంత్‌గౌడ్, సర్పంచులు రాజు, నర్సింహులు రైతు బంధు సమితి సభ్యులు మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిర్భయంగా ఓటు వేయాలి

- సీఐ కే.ఎస్‌రత్నం



కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైలు

ఆత్మకూరు, అక్టోబర్ 30: ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని ఆత్మకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కే.ఎస్.రత్నం అన్నారు. సోమవారం పట్టణంలో ఐటీబీపీ దళాల ఆధ్వర్యంలో పట్టణ పురవీధుల గుండా ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రజలు ఎలాంటి భయాందోళలనలు కలగకుండా భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ముందస్తుగా భద్రత దళాల మోహరింపు, శాంతి భద్రతల పరిరక్షణ కు వీరిని ఉపయోగించుకోనున్నట్లు చెప్పారు. శాంతియుత వాతావరణంలో ఓటుహక్కును వినియోగించుకునేందుకు కృషిచేస్తారన్నారు. రాజకీయ నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని ఎస్సై నరేందర్ కోరారు. కార్యక్రమంలో ఏఎస్సై బీచుపల్లి, సిబ్బంది పాల్గొన్నారు.

## తనిఖీల్లో రూ.1.50 లక్షలు పట్టివేత

మాగనూరు, అక్టోబర్ 30: మండల కేంద్రలోని పోలీస్ స్టేషన్ ఎదుట సోమవారం నిర్వహించిన వాహనాలు తనిఖీలో రూ. 1.50లక్షలు పట్టుకున్నట్లు ఎస్సై మల్లేశ్ తెలిపారు. రాయిచూర్ నుంచి ఊట్కూర్ మండలం పులిమామిడి గ్రామానికి వెళ్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.లక్ష 50వేలు పూలిమామిడి గ్రామానికి చెందిన వై రంగప్ప నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. నగదుకు ఎలాంటి రసీదు, తగిన పత్రాలు లేనందున సీజ్ చేసి జిల్లా ఎలక్షన్ ట్రెజరీకి పంపించామని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తీసుకువెళ్లాలంటే వాటికి సంబంధించిన రసీదు, తగిన పత్రాలు ఉండాలని లేకుంటే సీజ్ చేస్తామని తెలిపారు.

## క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

నారాయణపేట టౌన్, అక్టోబర్ 30: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రీడల పై ఆసక్తి పెంచుకోవాలని ఎస్‌జీఎఫ్ సెక్రటరీ నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణంలోని మినీ స్టేడియంలో స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 14 ఏండ్ల లోపు బాలబాలికలకు జిల్లా స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ, పీఈటీలు రత్నయ్య, బాలరాజ్, వెంకటేశ్, అనంతసేన, పారిజాత, రాధిక పాల్గొన్నారు.

## అన్నివర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ లక్ష్యం



ఆత్మకూర్‌లో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆత్మకూరు, అక్టోబర్ 30: అన్నివర్గాల అభివృద్ధే బీఆర్ఎస్ పార్టీ అజెండా అని పార్టీ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాలతో పాటు పట్టణంలోనూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారెంటీ లేని కాంగ్రెస్ పార్టీ మోసపూరిత హామీలతో ప్రజల్లోకి వస్తుందని, మోసపోతే మళ్లీ కష్టాలు తప్పవని అన్నా రు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే కారు గుర్తుకే ఓ టు వేయాలని అన్నారు. సీఎం కేసీఆర్ సారు రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పరుస్తున్నారన్నారు. ఓటు వేసేటప్పుడు ప్రతిఒక్కరూ ఎంతో ఆలోచించి వేయాలన్నారు. ఎవరో చెప్పిన మాటలు విని మోసపోతే తరువాత ఐదేండ్లు కష్టపడాల్సి వస్తదన్నారు. అమూల్యమైన ఓటును పేదలు, రైతులు, మహిళల సంక్షేమం కోసం పనిచేసే బీఆర్ఎస్‌కే ఓటు వేయాలని కోరారు. గ్రామంలో, పట్టణంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయిత్రీయాదవ్, వైస్ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, పీఏసీసీఎస్ అధ్యక్షుడు గాడి కృష్ణమూర్తి, లక్ష్మికాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేశ్వర్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ అద్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

## చదువుకు ఆటంకం కల్గించొద్దు

ఊట్కూర్, అక్టోబర్ 30: తల్లిదండ్రులు తమ పిల్లల చదువుకు ఆటంకం కలిగించ వద్దని అధ్యాపకులు కోరారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళలాశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు సోమవారం ప్రిన్స్‌పాల్ ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో అధ్యాపకులు విద్యార్థుల ఇళ్లను సందర్శించారు. ఈసందర్భంగా తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను గురించి వివరించారు. పొలం పనులు జోరందుకోవడంతో విద్యార్థుల హాజరు శాతం తగ్గుతోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా కళాశాలకు పంపాలని సూచించారు. కళాశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు బసయ్య, సత్యనారాయణ, మంజునాథ్, కల్పన, అశోక్, లింగప్ప, సునీత, స్వర్ణలత పాల్గొన్నారు.

## ఆడపిల్లలను కాపాడుకుందాం

మరికల్, అక్టోబర్ 30 : సమాజంలో ఆడపిల్లలపై వివక్ష చుపిస్తున్నరని, ఆడపిల్లలను కాపాడుకుందామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం-6లో నిర్వహించిన బేటీ పడావో-బేటీ బచావో కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపకుండా ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఆడపిల్లను లక్ష్మీదేవిగా భావించాలన్నారు. బాలికలపై చిన్నచూపు చూడకుండా అంగన్‌వాడీ టీచర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలోజెండర్ స్పెషలిస్టు అనిత, మానిటర్ రేణుక, పోషణ్‌అభియాన్ బీసీ రాజేశ్ , అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

## మక్తల్ కాంగ్రెస్‌లో అసమ్మతిరాగం

- ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం

మక్తల్ టౌన్, అక్టోబర్ 30 : నియోజకవర్గంలో మునిగిపోతున్న కాంగ్రెస్ పార్టీనీ బతికించి నిరంతరం పార్టీ కోసం కష్టపడిన నాయకులకు కాకుండా మరొకరికి టికెట్ కేటాయించడంపై అసమ్మతి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మక్తల్ మండలం జక్లేర్ గ్రామంలోని హరీఫ్ పంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే వీరారెడ్డి తనయుడు ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అసమ్మతి రాగంతో భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గంలో చతికిలబడిన కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి వేలాది మంది కార్యకర్తలను తయారు చేసిన వీరారెడ్డి తనయుడి ప్రశాంత్‌రెడ్డికి కాకుండా అధిష్టానం శ్రీహరికి సీటు కేటాయించడం సరికాదన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ కర్ణాటకలో భారత్ జోడో యాత్ర ముగించుకొని తెలంగాణలో అడుగుపెట్టిన సందర్భంలో మక్తల్ నియోజకవర్గంలో ప్రశాంత్‌రెడ్డి భుజ స్కంధాలపై వేసుకొని విజయవంతం చేశారన్నారు. అలాంటి నేతను కాదని వేరే వ్యక్తికి సీటు ఇవ్వడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి ఎంత సేవ చేసినా ఆధిష్టానం తనకు టికెట్ కేటాయించకుండా మరో నేతకు ఇవ్వడం బాధాకరమన్నారు. త్వరలోనే కార్యకర్తల అభిప్రాయం మేరకు తన కార్యాచరణను ప్రకటిస్తానని వెల్లడించారు. సమావేశంలో అసమ్మతి నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి